రంగురాళ్లు

పచ్చు(ర్లా)వు ఎ(ర్ర)గా కందిపోయాడు. బిగించిన పళ్లలోంచి దూసుకు రాబోయిన రెండు బూతు తిట్లని నోట్లో సిగరెట్టు పెట్టుకుని ఆపాడు. తిట్లు పొగలై పోతిరెడ్డి ముఖం మీంచి చీకట్లో కలిసిపోయాయి. రెండు దమ్ములు పీల్చిన తరువాత పచ్చు(ర్లా)వు మామూలు రంగులోకి వచ్చాడు. రెడ్డికి సిగరెట్టు అందిస్తూ అన్నాడు.

'నువ్వింత మొండి నా కొడుకు వనుకోలేదురా బావా!'

పోతిరెడ్డి సిగరెట్టు వెలిగించాడు. సమాధానం మాత్రం చెప్పలేదు. రాత్రి ఏడుగంటలు దాటింది. కొండల కడుపులోంచి చీకట్లు బయటపడి అలుము కున్నాయి. అది కొండరెడ్ల వీధి. చిమ్మచీకట్లో మినుకు మినుకుమంటోంది. కొన్ని గుడిసెల్లో, వరండాల్లో పొయ్యిలు వెలుగుతున్నాయి. పోతిరెడ్డి అరుగుమీద చెరో కర్ర స్తంభానికీ ఇద్దరూ ఆనుకుని కూచున్నారు. ఇంటి ముందు దడి దగ్గర పచ్చు(ర్లా)వు చిన్న మోటారుసైకిలు చీకట్లో కలిసిపోయింది. లోపలి గదిలో పోతిరెడ్డి పెళ్లాం పిల్లాడికి పాలిస్తోంది. సిగరెట్టు ఆవతల పారేసి పచ్చు(ర్లా)వు పక్కనే వున్న సత్తు చెంబులో మిగిలిన జీలుగు కల్లు ఒక్క గుక్కలో ఖాళీ చేశాడు. కడుపులోంచి తన్నుకొచ్చిన త్రేనువుతోపాటు లోపల్నించి పెద్ద మూలుగు వినిపించింది. అప్పటివరకూ వేసిన బొమ్మలా నిశ్చలంగా కూచున్న పోతిరెడ్డి 'అయ్యో' అంటూ ఒక్క గంతులో లోపలికి వెళ్లాడు. పచ్చు(ర్లా)వు

తుపుక్కున ఉమ్మేసి మరో సిగరెట్టు తీశాడు. లోపల్నించి మరో పెద్ద మూలుగు వినిపించింది. లోపలికెళ్ళి ముసలాడి పీక నులిమేద్దామని పించిందతనికి. అతనొచ్చి గంట దాటుతోంది. ఎంత బతిమాలినా పోతిరెడ్డి నోరు విప్పడం లేదు. అసలు వింటున్నాడో, లేదో తెలీలేదు పచ్చర్రావుకి. రోగంతో ఉన్న ముసలాడు పడుండక మూలగడం అతనికి మరీ ఇబ్బందిగా ఉంది. (''ఆడు పోఁడ్రా బాబూ, నా మాటిను'')

పచ్చర్రావు అడ్డతీగల స్టేషన్లో పి.సి. ఉద్యోగరీత్యా ఎవర్నీ బతిమాలడం అలవాటు లేకపోవడం వల్ల పోతిరెడ్డి అతనికి మేజిస్ట్రేట్లా పరిణమించాడు. మూడో మూలుగు తర్వాత పెళ్లాన్ని తిట్టి బయటికొచ్చాడు పోతిరెడ్డి. అరుగుమీద కూలబడి గంగమ్మకి దండాలు పెట్టాడు. గుండెలు బాదుకుంటూ 'అమ్మా, తల్లో' అంటూ, చీకట్లోకి వెయ్యోసారి కోడిని కోస్తానని ప్రమాణాలు చేశాడు రెడ్డి. పచ్చర్రావుకి దడి అవతల గంగమ్మ కనిపించలేదు. కాసేపు నిశ్శబ్దంగా ఏడిచి మోకాళ్లమధ్య తలపెట్టుకుని ఉండిపోయాడు పోతిరెడ్డి. ముసలాడితో పాటు రెడ్డిని కూడా సొంత చేతుల్తో చంపెయ్యాలనిపించింది పచ్చర్రావుకి. చీకటి పడే కొద్దీ ఒక్కడూ అడ్డతీగల వెళ్లగల ధైర్యం అతనికి పోలీసు ఉద్యోగం ఇవ్వలేదు. పది కిలోమీటర్లు పైగా రాత్రి ఒంటరిగా దొరగారి జీపులో కూడా వెళ్లలేదతను. పోలీసు వాసనలు చెట్లలోంచీ, పొదల్లోంచి లోపలికి వ్యాపిస్తాయని తెలుసతనికి. తిరుగు ప్రయాణం గుర్తొచ్చేసరికి జబ్బు చేసినట్టయింది.

''బావా! నా మాట ఆలకించు. నువ్వేడిసి మొత్తుకుంటే నీ బాబు రోగం తగ్గుద్దా? డాక్టర్రావాలి. లేదా ఆరిచ్చే మందు లేనా రావాలి. స్కూల్లో టీచరుగానీ, డాక్టరుగానీ ఎప్పుడేనా రావడం ఎరుగుదువా? ఇదో సిగరెట్టు.. కాల్చుకో. నేను ప్రెమాణం చేసి చెప్తున్నాను. పని అయిపోగానే నీ బాబుకి మందులు ఏలేశ్వరం నుంచి అయగారు కొని పంపిత్తార్రా మగడా!''

పోతిరెడ్డి సిగరెట్టు వెలిగించాడు. అగ్గిపుల్ల వెలుగులో వాడి చెంపలమీద నీటి చారిక తళుక్కుమంది. వాడి గుండెల్లో తపసికొండ ఇరుక్కుపోయింది. చీకట్లోకి చూస్తూ ఉండిపోయాడు.

''ఇదో... ముందీ యాభై ఉంచమన్నారయ్యగారు. ఆడికి పెద్ద జబ్బు గాదురా బావా. ఇరోశనం గాక అంతే'' ముసలాడి వ్యాధి వివరిస్తూ సాధ్యమైనంత శాంతంగా మళ్లీ మొదటికొచ్చాడు పచ్చ్రలావు.

''మా అయగారికి ట్రాన్సురై పోయింది. దేవుళ్లాటి మనిషి. రాళ్ల తవ్వడాలు మొదలెట్టి రెండేళ్లయిందా. అయగారికి మిగిలిందేవీ లేదు. ఇప్పుడసలు ఎల్లేపోతన్నారు. పోనీ మీ జోలికి ఎప్పుడూనా ఒచ్చేరేమో ఎరుగుదువా? వైజాగు నుంచి సేట్లు రావడం మాకు తెల్దా? రాజమండ్రి బ్రోకర్లు రావడం మాకు తెల్దా? ఎవరెవరు తవ్వుకుంటున్నారో నీకు తెలుసు, మాకు తెలుసు. మేవూ, బ్రోకర్లూ కిందా మీదా పడ్డాం. అందులో అయగారికి ఒచ్చిందేవీ లేదు. పందేరాలతో సరిపోయింది. పేపరోళ్లు రాశారు. కేసులు పెట్టేం. ఆ గొడవేరు. మీ గురవయ్య తమ్ముడు ఆడి జన్మలో పంట్లాం చూశాడా, తొడిగాడా! సేటు నా కొడుకులు ఎంతిత్తన్నారు? మీ వీధిలో ఇద్దరికి లూనా బళ్లు ఏణ్నించి ఒచ్చేయిరా బావా! సత్తిరాజు బండిమీద చోడవరం పోయి వీడీలు తగిలించు కున్నాడా, లేదా? నాలుగు డబ్బులూ పోయేయి. వీడీలు మిగిలి పోయాయి. అంతేనా! ఆ గొడవ మనకొద్దు''

పచ్చ్రలావు ఉపన్యాసానికి లోపల్నించి మరో పెద్ద మూలుగు అంతరాయం కలిగించింది. ఈసారి పోతిరెడ్డి లోపలికి వెళ్లేదు. తల బాదుకుంటూ కూచుండి పోయాడు. రెడ్డి పెళ్లాం ఏడుస్తూ గంగమ్మ తల్లికి మొక్కు కుంటోంది. చంటి పిల్లాడు సన్నగా ఏడుపు మొదలెట్టాడు.

ఒక క్షణం ఆగి పచ్చ్రలావు అన్నాడు. ''జాగర్తగా ఆలకించు మరి. పోనీ అయగారి గొడవదిలెయ్. ముసలాడికి మందులు ఏణ్నించి ఒస్తాయిరా మావా? ఆణ్ని సంపేసుకుంటావా? మీరు ఈ పాలికి ఎళ్లి రండి. నీకు రావలసిన లెక్క నేను ఎల్లుండి సాయంత్రం నీ చేతుల్లో పెడతాను. అయగారు మందులు పంపుతారు. ఈడు రెండ్రోజుల్లో సుబ్బరంగా లేచి తిరుగుతాడు. నా మాటిను. ఇంకో ఎదవనీ, ఇంకో ఎదవనీ ఎందుకడగలేదు? నీ దగ్గిర న్యాయం ఉంది. ఇంకోడైతే రాళ్లు కప్పెట్టుకుని మొండి చెయ్యి చూపిస్తాడు. మా అయగారి కోసం కాదనుకో. నీ బాబు కోసం బయలుదేరు. ఇంక మాట్లాడక.

లేటయిపోద్ది నాకు. మీ వాళ్లని నలుగుర్నీ కేకేసుకుని ఎళ్లిరండి మరి. రేపు నీకు ఒకటో రకం ఫస్టాక్లాసైన కొరియా బేట్రీ పంపుతాను. మళ్లీ జార్తగా ఇచ్చేద్దుగాని. అదీ. డబ్బుల్తో నీ బాబు రోగం నయవౌద్దంటున్నాగా. మా అయగారికి ఏదో ముట్టజెప్పినట్టవుద్ది. ముసిలాడి జబ్బు ముఖ్యం. మరి ఉంటాన్రా బావా''

పోతిరెడ్డి భుజం తట్టి వాహనం కదిలించి బయలుదేరాడు పచ్చ్రులావు. రెడ్డి కూచున్న చోటునుంచి కదలలేదు. రెండు నిముషాల తర్వాత చీకట్లోంచి పచ్చ్రులావు బండి రోడ్డెక్కడం వినిపించింది. అప్పుడు తలెత్తి చూశాడు. దూరంగా రోడ్డుమీద వేగంగా పచ్చ్రులావు లైటు పరిగెడుతోంది. అరుగు గోడ వారగా ఉన్న చెంబులోంచి కల్లు తాగి అక్కడే వెల్లకిలా పడుకున్నాడు రెడ్డి. ఎప్పుడు నిద్ర పట్టిందో తెలీదుగానీ వాడికి రాత్రి కలొచ్చింది. కలలో ముసలాడు ఆరోగ్యంగా ఒంటినిండా దుప్పటి కప్పుకుని బయట మంచంమీద కూచుని చుట్ట కాలుస్తున్నాడు. కాళ్ల దగ్గిర మట్టిలో మనవరాలు ఆడుకుంటోంది. చటుక్కున మెళకువ వచ్చింది. అరుగు చివరికి దొర్లి బయటికి చూశాడు పోతిరెడ్డి. కొద్దిగా పాలు ఎక్కువైన పల్చటి టీ డికాషన్‌లా ఉంది వెన్నెల. తరువాత ఎప్పుడోగాని నిద్రపట్టలేదు రెడ్డికి.

పోతిరెడ్డి బాబుకి కొంచెం భూమి ఉండేది. అందులోంచి సెంటున్నర పొలం విడిపించుకుని ఏడాది అయింది. అప్పుకింద రెండెకరాల చిల్లరా దఖలై పోయింది. తీసుకున్న అప్పుకీ, రెండెకరాలకీ సంబంధం ఏవిటో తండ్రీ కొడుకులిద్దరికీ తెలియలేదు. తొమ్మిదొందలూ తీర్చినా రెండొందలే జమైందనీ, అది వడ్డీ కూడా సరిపోలేదని మధ్యవర్తీ, అప్పిచ్చిన పెద్దమనిషీ నచ్చచెప్పారు. ఇచ్చినట్టు రుజువు లేదు. తీసుకున్నట్టూ రుజువు లేదని చెప్పడం పోతిరెడ్డికి తెలీలేదు. ముసలాడు వీధిలో నలుగుర్నీ పోగేసి యాగీ పెట్టాడు. మధ్యవర్తి అంతా విని సబబు చెప్పడానికి ఎమ్మార్వో దగ్గిరికో, పోలీసు స్టేషనుకో పోదాం పదమన్నాడు. వెళ్లిన నలుగురికీ నోట మాట రాలేదు. గంగమ్మ తల్లి ఎదురుగా నిమ్మకాయ కోసి నిజం చెప్తానన్నాడు పోతిరెడ్డి. గిరిజన భూముల్ని అప్పుకింద జమ కట్టుకునే వ్యవహారంలో గంగమ్మకి అనుభవం లేదు గనక అటువంటి 'సాచ్చికాలు' ఒద్దన్నాడు మధ్యవర్తి. మొత్తానికి రెండెకరాలూ పోగా సబబుగా సెంటున్నర భూమీ ముసలాడికి దక్కింది. మొదట సబబు

చెప్పడంలో, తరువాత పంటని దక్కించుకోవడంలో గంగమ్మ తల్లీ, పోతరాజు కల్పించుకోకపోవడం వల్ల మొదటి పంటలో పోతిరెడ్డికి మిగిలిందేవీ లేదు. పది రోజుల క్రితం చెట్టంత ముసిలాడు కడుపు చేత బట్టుకుని కూలిపోయాడు. దెబ్బతిన్న పాములా మెలికలు తిరిగిపోయాడు. గురవయ్య దగ్గిర చెక్క మందులు తెచ్చి పోశాడు పోతిరెడ్డి. తగ్గినట్టే తగ్గి నొప్పి మళ్లీ మొదలైంది. పోతిరెడ్డికి కొండంత బెంగపడింది నెత్తిమీద. రోజురోజుకీ ముసలాడి పరిస్థితి దిగజారుతోంది.

పచ్చ(లావు చెప్పినట్టు వీధిలో మోటారు బళ్లు తిరగడం, పేంట్లూ చొక్కాలూ పోతిరెడ్డికి తెలీకపోలేదు. తపసికొండకి బొరియ పడింది. జట్లు జట్లుగా రంగురాళ్ల తవ్వకాలు జరగడం తెలుసు వాడికి. బ్రోకర్లు, పోలీసుల, సేట్ల వలయం మాత్రం వాడికి సరిగా తెలీదు. అప్పటికి నెల రోజుల క్రితం గురవయ్య తమ్ముడు పోలీసుల నోట బడి తప్పించుకున్నాడు. రహస్యంగా ఓ రోజు రెండు నీలపురాళ్లు తెచ్చి చూపించి ఓ అరపెట్టె పొడవాటి సిగరెట్లిచ్చాడు పోతిరెడ్డికి. మరో మార్పు కూడా చూశాడు రెడ్డి. ఊరుని మెయిన్ రోడ్డుతో కలిసే మట్టి దారంలాటి రోడ్డు మొదట్లో రెండు పెద్ద కిళ్లీ కొట్లు వెలిశాయి.

ఉదయం పది దాటుతుండగా పచ్చ(లావు కొరియా బేటరీ పంపించాడు. లోపల గదిలో ముసలాడి మీద లైటు వేసి చూశాడు పోతిరెడ్డి. క్షణకాలం గదంతా తెల్లగా మెరిసిపోయింది. రెడ్డి పెళ్లాం చంటిపిల్ల ముఖంమీద లైటువేసి ఆడిస్తుండగా, ముసిలాడు పెద్దగా మూలిగి మెలికలు తిరిగిపోయాడు. బాటరీ గట్టిగా పట్టుకుని భయంగా తండ్రివేపు చూశాడు పోతిరెడ్డి. కాసేపు మూలిగి కళ్లు మూసుకున్నాడు ముసిలాడు.

మధ్యాహ్నం నలుగురూ చింతచెట్టు కిందికి చేరారు. గురవయ్య తమ్ముడు గొంతు తగ్గించి మాట్లాడాడు. పోతిరెడ్డికి అతని మాటలు పూర్తిగా బుర్ర కెక్కడం లేదు. మిగతా ఇద్దరూ తలూపారు. నలుగుర్లో కొత్తవాడు పోతిరెడ్డి. చీకటిపడ్డ తరువాత నలుగురూ విడివిడిగా ఎక్కడ కలుసుకోవాలో చెప్పాడు తమ్ముడు. పోతిరెడ్డి లేచి తువాలు తలకు చుట్టుకు బయలుదేరాడు.

''నువ్వెలగాగు. మాతాడాల'' అన్నాడు తమ్ముడు.

మిగతా ఇద్దరూ వెళ్లిపోయారు. సిగరెట్టు వెలిగించి తక్షణంగా పోతిరెడ్డి వేపు చూశాడు. గుడ్లప్పగించి అతనివేపే చూశాడు రెడ్డి. చివరికి అడిగాడు తమ్ముడు.

''పచ్చబ్రాలావేతన్నాడు?''

''ఏతన్నాడు! అయ్యకి ఏలేశరం నుంచి మందుతెత్తనన్నాడు''

''అంతుకేనా?''

''మరంతుకే''

''గంగమ్మమీద ప్రెమానం జెయ్యి''

ఒకళ్ళ కళ్లలోకి ఒకళ్లు సూటిగా చూసుకున్నారు. ''ఒద్దులే'' అన్నాడు తమ్ముడు. ఇద్దరూ కలిసి ఇల్లకి బయలుదేరారు. నిశ్శబ్దంగా నాలుగడుగు లేసిం తరవాత తమ్ముడన్నాడు. ''పచ్చబ్రాలావు విసప్పురుగు. పోలీసోడు విసప్పురుగు'' తమ్ముడు మలుపు తిరిగి వెళ్లిపోయాడు.

పోతిరెడ్డి ఇంట్లోకి అడుగు పెట్టకముందే పెళ్లాం ఏడుపు వినిపించింది. రెడ్డి కడుపు తరుక్కుపోయి అడుగు ముందుకు పడక క్షణంసేపు అలాగే ఉండిపోయాడు. లోపల ముసలాడు మూలుగు తున్నాడు. మూలుగు, ఆయాసం కలిసి అతని డొక్క లెగిసి పడుతున్నాయి. కొరియా బేట్రీ వేసి అయ్య ముఖం చూశాడు రెడ్డి. మొహం చెమటతో మెరుస్తోంది. కళ్లు గోళీకాయల్లా ఉన్నాయి. నోరు సగం తెరిచి మూలుగుతున్నాడు. పోతిరెడ్డికి కడుపులోంచి ఏడుపు తన్నుకొచ్చింది. నిద్రపోతున్న శవంలా గున్నాడు ముసలయ్య.

అరుగుమీద కూచుని సత్తు కంచంలో అన్నంవేపు చూసుకుంటూ ఉండిపోయాడు పోతిరెడ్డి. గోడనానుకుని పిల్లాడికి పాలిస్తోంది రెడ్డి పెళ్లాం. కాసేపు చూసి ''బువ్వ దినవా!'' అందామె. పోతిరెడ్డి ఆమె మాటలు వినలేదు. మరో నిముషం అలాగే ఉండిపోయి తల వూపుతూ గబగబ మూడు ముద్దల్లో అన్నం ముగించాడతను. బువ్వ తినగానే మాట్లాడకుండా చాప పరుచుకుని నిద్రపోయాడు రెడ్డి.

తపసి కొండ నెత్తిమీద మబ్బు చివర్లు మండుతున్నాయి. క్రమంగా కొండ నల్లబడింది. అడవి చీకటి వల్లోపడిపోయింది. తువాలు తలకు చుట్టుకుని టీ తాగుతూ లోపలికెళ్లాడు పోతిరెడ్డి. ముసిలాడు బాధతో నిశ్శబ్దంతో గిలగిల్లాడుతున్నాడు. మూలుగు గొంతులోనే సుళ్లు తిరుగుతోంది. తువాలుతో అయ్య ముఖం తుడిచి, మోకాళ్ల మీద కూచుని ముసలాడి చెవిలో గుగుసలాడాడు పోతిరెడ్డి. కళ్లు తెరవలేదు ముసలాడు. కాసేపు పక్కనే కూచుని గంగమ్మ తల్లికి మొక్కాడు రెడ్డి. కొద్దిగా మిగిలిన గోర వెచ్చటి టీ మెల్లిగా ముసలాడి నోట్లో పోశాడతను. ద్రవం గొంతు దిగిందో, లేదో ముసలాడికి పొరబోయి గొంతు బద్దలయ్యేలా దగ్గేడు.

కొరియా బేట్రీ చంకలో పెట్టుకుని చీకట్లో, అనుకున్న చోటికి చేరాడు రెడ్డి. మరో పది నిముషాలు ఆగి, ఆఖరి బీడీ కాల్చి నలుగురూ కొండవేపు నడిచారు. లైటు వెయ్యకుండా నిశ్శబ్దంగా తుప్పలు దాటుకుంటూ నడుస్తున్నారు. చల్లటి గాలేస్తున్నా నలుగురికీ చెమటలు పట్టేశాయి. గుండె చప్పుళ్లు గాల్లో కలిసిపోతున్నాయి. కొండ ఇంకా రాయి విసురు దూరంగా ఉండగానే జట్టుని ఆపేశాడు తమ్ముడు. కళ్లు పొడుచుకుని, లేళ్లలా చెవులు రిక్కించి చాలాసేపు నిలబడిపోయారు. తుప్పల వెనక రెండు కుందేళ్లు బెదిరి పారిపోయాయి. ఈసారి మెల్లిగా నడుస్తూ నలుగురూ కొండ దగ్గరికి చేరారు. మరో వందగజాలు నడిచిన తరవాత ముగ్గుర్నీ దగ్గిరగా గోడలా నిలబెట్టాడు. దడతో, భయంతో పోతిరెడ్డి నుంచున్న చోటే వెనక్కి తిరిగి ఉచ్చపోశాడు. కొండ చరియ అంతా తమ్ముడికి పరిచితమే. లైటు వేశాడు తమ్ముడు. కొండ కడుపు కింది భాగం పూర్తిగా పెద్ద బొరియలాగ ఏర్పడింది. లైటు ఆర్పి నలుగురూ గునపం దెబ్బలు ఎక్కువ పడని గోడవేపు జరిగారు. చీకట్లో రావడం తమ్ముడి: విసుగ్గా ఉంది. అడవిలోంచి విచిత్రమైన శబ్దాలు వినిపిస్తున్నాయి. చిమ్మ చీకట్లో ప్రాచీన మానవుల్లా నలుగురూ తవ్వడం ప్రారంభించారు. మాటిమాటికీ తువాలు చుట్టిన బాటరీ లైటు వేస్తూ పని కొనసాగించారు. కాలంతో నిమిత్తం లేని అంతరిక్షపు అంధకారంలో స్తంభించిపోయిన గ్రహాన్ని తవ్వుతున్నట్టుంది. పోతిరెడ్డికి భయంతో చేతులు వణుకుతున్నాయి. కడుపులో తీవ్రమైన కదలిక మొదలైంది. చెమటతో ఒళ్లూ, లుంగీ తడిసిపోయాయి. తలమీద పడిన మట్టి,

చెమట కాలవలా ఒంటిమీద జారుతున్నాయి. ముగ్గురూ ఒగరుస్తూ కూచుండి పోయారు.

తమ్ముడు మరోసారి లైటు వేసి వెలుతురు పడ్డ మేరంతా వేళ్లతో గోకుతున్నాడు. అతని పెదాలు నవ్వుతో విచ్చుకున్నాయి. మట్టిపెళ్లని చేత్తో తీసుకుని మెల్లిగా మట్టిని గోకి తీశాడు. మోకాళ్ల మధ్య తల పెట్టుకుని కూచున్నాడు పోతిరెడ్డి.

మొదటి మట్టి ముద్ద పోతిరెడ్డి వీపుమీద పడింది. తల పైకెత్తి చూశాడు. లైటు వెలుగులో నాలుగు ఎరుపు, పచ్చ రాళ్లని చేతిలో చూపిస్తూ ఒంగాడు తమ్ముడు. ఈసారి మరో పెద్ద మట్టి పెళ్ల వాడి వీపుమీద పడింది. ముగ్గురూ కూచుని లైటు బయటికి కనిపించకుండా వెలుతుర్లో రంగురాళ్లు చూసుకున్నారు. నలుగురికీ నవ్వొచ్చింది. ఈలోగా కొండ విచ్చుకుంది. నలుగురూ లేచారు. వాళ్లింకా పూర్తిగా లేవకముందే ఒక క్షణంలో చల్లగా, నిశ్శబ్దంగా తపసికొండ కడుపు కండల్లో పెద్ద చరియ విరిగిపడింది. నలుగురూ పెద్ద కేకేవేసి బయటికి దూకబోయారు. పోతిరెడ్డి బాటరీ బైటకి విసిరేశాడు. నలుగురి కేకలూ కొండ కడుపులో తేనువుల్లా ఆగిపోయాయి. విసిరేసిన ఫస్ట్క్లాసైన కొరియా బాట్రీ తుప్పల్లో పడింది. బాటరీ కన్ను నిర్నిమేషంగా ఆకాశాన్ని చూస్తూ ఉండిపోయింది.

*